నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, బుధవారం 3 ఏప్రిల్ 2024 | HYDERABAD


## మూసీ తీరంలో అనుమతులకు బ్రేక్!

**50 మీటర్ల లోపు పర్మిషన్లను నిలిపివేసే నిబంధన కచ్చితంగా అమలు**

**టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేసిన కమిషనర్**

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : మూసీ నది నుంచి 50 మీటర్ల పరిధిలో నిర్మాణ రంగ అనుమతులను నిలిపివేస్తూ జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్ నిర్ణయం తీసుకున్నారు. మూసీ నదికి ఇరువైపులా 50 మీటర్ల లోపు భవన, లేఅవుట్ నిర్మాణాలకు ఆంక్షలు ఉన్నాయి. అయితే అక్కడక్కడ భవనాలు, షెడ్లు వెలుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈ నిబంధనను కచ్చితంగా అమలు చేయాలని కమిషనర్ టౌన్‌ప్లానింగ్ విభాగానికి ఆదేశాలు జారీ చేశారు. కాగా ప్రభుత్వం మూసీని అద్భుత పర్యాటక క్షేత్రంగా తీర్చిదిద్దే చర్యలు చేపడుతున్నది. ఇందులో భాగంగానే ఎంఆర్‌సీడీఎల్ విజ్ఞప్తి మేరకు మూసీ తీరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.





తలసాని శ్రీనివాస్ యాదవ్ నివాసంలో ఎమ్మెల్యేలు, నేతలతో సమావేశమైన అభ్యర్థి పద్మారావుగౌడ్

# ట్యాంకర్ రావట్లే

## నీటి కష్టాలు తీరట్లే!



**బుక్ చేస్తే 48 గంటలైనా.. దొరకని వాటర్ ట్యాంకర్**

**వెస్ట్ జోన్‌లో విపరీతమైన డిమాండ్**

**గత ఏడాది మార్చి నెలలో 79వేల ట్యాంకర్లు**

**ఈ ఏడాది మార్చి నెలలో లక్షా 19వేల బుకింగ్స్**

**రద్దీ నివారణ చర్యలు చేపడుతున్నా.. సకాలంలో అందని ట్యాంకర్ నీరు**

**పాతబిల్లులు చెల్లిస్తేనే ట్యాంకర్ బుకింగ్**

**నీటికోసం తల్లడిల్లుతున్న మహానగర వాసులు**

సిటీబ్యూరో, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : గ్రేటర్ హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్‌కు డిమాండ్ ఏర్పడింది. ముఖ్యంగా వెస్ట్‌జోన్ పరిధి శేరిలింగంపల్లి, మాదాపూర్, అయ్యప్పసొసైటీ, జూబ్లీహిల్స్, మణికొండ, రాయదుర్గం తదితర ప్రాంతాల్లో ట్యాంకర్ నీరు లేనిదే రోజువారీ కార్యక్రమాలు జరగని పరిస్థితి నెలకొన్నది. ఎండల తీవ్రత ఒకవైపు, గతంలో ఎన్నడూ లేని విధంగా వర్షాభావ పరిస్థితులు, వేసవి ప్రారంభంలో భూగర్భజలాలు అడుగంటిపోవడంతో జలమండలి వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ నెలకొంది. ఈ నేపథ్యంలో ట్యాంకర్ బుక్ చేస్తే 48గంటల సమయం పడుతుందంటే డిమాండ్ ఏ మేర ఉందో అర్థం చేసుకోవచ్చు. వాటర్ ట్యాంకర్ రద్దీ నివారణకు జలమండలి ప్రత్యామ్నాయంగా అదనపు ట్యాంకర్లు, డ్రైవర్లను సమకూర్చుకోవడంతో పాటు ఫిల్లింగ్ స్టేషన్ల సంఖ్యను పెంచుతున్నప్పటికీ పెండింగ్ సంఖ్య గణనీయంగానే ఉంటుంది. రోజుకు సరాసరిగా 6500లకు పైగా ట్యాంకర్లు బుకింగ్ అవుతున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

### మార్చిలోనే లక్షా 19 వేల ట్యాంకర్ల నీటి సరఫరా

ఈ ఏడాది మార్చి నెలలో మొత్తం లక్షా 69వేల ట్యాంకర్ల నీటిని అధికారులు సరఫరా చేశారు. గత నెల మార్చి 1న ట్యాంకర్ బుకింగ్ సంఖ్య 4588 ఉంటే 31వ తేదీ నాటికి ఈ సంఖ్య రోజుకు 6280 వరకు ఉంది. దాదాపు 1700 ట్రిప్పులు అదనంగా అధికారులు సరఫరా చేస్తూ వచ్చారు. మొత్తంగా గతేడాది మార్చిలో 79వేల ట్యాంకర్లు బుకింగ్ కాగా.. ఈ ఏడాది మార్చిలో మొత్తం లక్షా 19వేల బుకింగ్స్ వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. ట్యాంకర్ డిమాండ్‌ను అంచనా వేసి జలమండలి ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకొని ట్యాంకర్లు, డ్రైవర్ల సంఖ్య పెంచుకోవడం జరిగిందని, మూడు షిఫ్టుల్లో పనిచేయడం, రాత్రి వేళల్లో షిఫ్ట్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించడం, అదనపు ఫిల్లింగ్ స్టేషన్లు, వాటర్ ఫిల్లింగ్ పాయింట్స్ పెంచడం లాంటి చర్యలు చేపడుతున్నట్లు ఎండీ సుదర్శన్ రెడ్డి తెలిపారు.



కూకట్‌పల్లిలో నీరు సరఫరా చేస్తున్న ట్యాంకర్

### బిల్ పెండింగ్‌లో ఉంటే ట్యాంకర్ నిరాకరణ

ట్యాంకర్ బుకింగ్‌లో క్యాన్ (నల్లా కనెక్షన్)నంబర్ తప్పనిసరి. అయితే సదరు వినియోగదారుడు అప్పటి వరకు నల్లా బిల్లు పెండింగ్‌లో ఉంటే వాటర్ ట్యాంకర్ నిరాకరణ చేస్తున్నారు. బిల్లు చెల్లిస్తేనే వాటర్ ట్యాంకర్ సరఫరా జరుగుతున్న పరిస్థితి. వాటర్ ట్యాంకర్ కోసం పెండింగ్ బిల్ క్లియర్ చేయడం, వెంటనే అపై ట్యాంకర్ కోసం ఫోన్ చేస్తే వెయిటింగ్ జాబితా పేరుకుపోతుంది. దీంతో ట్యాంకర్ నీరు దొరకక తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలోనే నాన్ డొమిస్టిక్ (స్లమ్స్)లో కమర్షియల్‌గా భవనాన్ని కట్టి డొమిస్టిక్ ముసుగులో నెలకు 20కేఎల్ ఉచిత నీటిని పొందుతున్న కొందరు భవన యాజమానులు దాదాపు 30శాతం మంది వరకు పథకం కిందకు రాక ముందు నీటి బకాయిలు ఉన్నారు. జలమండలి సరఫరా చేసే అరకొర నీటి సరఫరాతో వీరు సైతం ట్యాంకర్ బుక్ చేస్తే బిల్ పెండింగ్ కనబడుతుందని ట్యాంకర్ సరఫరా చేయలేమని చెబుతున్నారు.

### ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన ఎండీ

జలమండలి పరిధిలో ఉన్న పలు ట్యాంకర్ ఫిల్లింగ్ స్టేషన్లను ఎండీ సుదర్శన్‌రెడ్డి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మణికొండ, నేతాజీపార్కు, షేక్‌పేట ఫిల్లింగ్ స్టేషన్లను పరిశీలించారు. జీహెచ్ఎంసీ నుంచి వచ్చిన తాత్కాలిక డ్రైవర్ల సేవల్ని వినియోగించుకోవాలని సూచించారు. రాత్రి సమయాల్లో వీలైనంత ఎక్కువగా వాణిజ్య నీటి అవసరాల ట్రిప్పులు సరఫరా చేస్తే.. పెండెన్సీ లేకుండా చూసుకోవాలన్నారు. ట్యాంకర్ బుకింగ్, డెలివరీ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. బుకింగ్ టైమింగ్స్, ఏ సమయానికి డెలివరీ ప్రారంభిస్తున్నారు? అనే విషయాలను అధికారుల నుంచి తీసుకున్నారు. ట్యాంకర్ డెలివరీకి సంబంధించిన ఇన్ అండ్ ఔట్ లాగ్‌బుక్స్ పరిశీలించారు. ఫిల్లింగ్ స్టేషన్లలోని సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేస్తున్నాయా లేదా పరిశీలించాలని ఎండీ సూచించారు.

## సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్‌దే విజయం

**నేటి నుంచి అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా సమన్వయ సమావేశాలు**

**ఎంపీ అభ్యర్థి పద్మారావుగౌడ్, ఎమ్మెల్యేలు**

సికింద్రాబాద్, ఏప్రిల్ 2 : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానాన్ని బీఆర్ఎస్ పార్టీ కైవసం చేసుకోనున్నదని, పార్టీ అభ్యర్థి తీగుల్ల పద్మారావు గౌడ్ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని నగరానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, నేతలు పేర్కొన్నారు. సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ నేతల సమన్వయ సమావేశం మంగళవారం సాయంత్రం మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో మారేడుపల్లిలోని ఆయన నివాసంలో జరిగింది. పార్లమెంట్ అభ్యర్థి, సికింద్రాబాద్ శాసనసభ్యుడు తీగుల్ల పద్మారావు గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సమావేశంలో పార్టీ నగర అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, అంబర్ పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్, సీనియర్ నేతలు డాక్టర్ దాసోజు శ్రవణ్‌కుమార్, విప్లవ్ కుమార్, మన్నె గోవర్ధన్, ఆనంద్ గౌడ్, వెంకటేశ్, మన్నె కవిత, ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎంపీ ఎన్నికల్లో చేపట్టాల్సిన చేపట్టాల్సిన చర్యలపై సమగ్రంగా చర్చించారు.

### నేటి నుంచి సమన్వయ సమావేశాలు

జంట నగరాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచించారు. 3న జూబ్లీహిల్స్, 4న సికింద్రాబాద్, 5న ముషీరాబాద్ , 6న సనత్‌నగర్‌లో, 7న ఖైరతాబాద్, 8న నాంపల్లి , 10న అంబర్‌పేట నియోజకవర్గాల్లో సమన్వయ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

# ₹500 పంట బోనస్ ఏమైంది?

**కేసీఆర్ పొలం బాటతో.. సర్కారు గుండెల్లో దడ**

**పంట నష్టపోయిన రైతులకు రూ.25 వేలు ఇవ్వాలి**

**చేరికల గేట్లు కాదు.. ముందు ప్రాజెక్టుల గేట్లు తెరిచి రైతులకు నీళ్లివ్వండి**

**రైతు సమస్యలపై దీక్షలు, ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి**

**రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో వినతి పత్రం అందజేత**

**హాజరైన ఎమ్మెల్యేలు అరెకపూడి గాంధీ, ప్రకాశ్ గౌడ్, కాలే యాదయ్య, ఎమ్మెల్సీ సురబి వాణీదేవి**

రంగారెడ్డి, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ) : ఇతర పార్టీల నేతల కోసం గేట్లు తెరవడం కాదు.. ప్రాజెక్టుల గేట్లు తెరిచి రైతులకు నీళ్లివ్వాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు రైతులకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని, క్వింటాలుకు రూ.500బోనస్ చెల్లించి యాసంగి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరుతూ మంగళవారం జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి కలెక్టరేట్‌కు వెళ్లి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ కరువు పరిస్థితులతో రైతులు కష్టాల్లో ఉండగా.. ప్రభుత్వం బాధిత రైతులకు ధైర్యం చెప్పే ఆలోచన కూడా చేయకపోవడం సిగ్గు చేటన్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, మద్దతు ధరతోపాటు రూ.500బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.25వేల నష్ట పరిహారం అందించాలని, రైతు భరోసా కింద రైతులకు ఏడాదికి రూ.15వేల సాయం అందించాలని, కౌలు రైతులకు సైతం అదే స్థాయిలో సాయం అందించాలన్నారు. 2లక్షల రుణమాఫీని అమలు చేయడంతోపాటు పశుగ్రాసం పంపిణీకి తక్షణమే చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


### కేసీఆర్ రైతు ఉద్యమంతో కాంగ్రెస్‌లో వణుకు

కష్టాల్లో ఉన్న రైతులకు బాసటగా నిలిచేందుకు కేసీఆర్ రైతు ఉద్యమం ప్రారంభించడంతో కాంగ్రెస్ పాలకుల్లో వణుకు మొదలైందని సబితా ఇంద్రారెడ్డి అన్నారు. 110 రోజుల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అన్నీ వైఫల్యాలేనని విమర్శించారు. కేసీఆర్ ఒక్క రోజు పర్యటనతోనే భయపడ్డ కాంగ్రెస్ ప్రభుత్వం వరద కాల్వ, సాగర్ కాల్వలకు నీటిని విడుదల చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, టి.ప్రకాశ్ గౌడ్, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణా రెడ్డి, ఎంపీపీ కృపేష్, జడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, మహేశ్వరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ మహేందర్ రెడ్డి, కౌన్సిలర్ సప్పిడి లావణ్య రాజు, మాజీ సర్పంచు బాట సురేశ్, సప్పిడి లావణ్య, శ్రీలత, ప్రవీణ్, మధు, రాంరెడ్డి, నర్సింహ్మా, ప్రవీణ్, చంటి తదితరులు పాల్గొన్నారు.



### మేడ్చల్ కలెక్టరేట్‌లో వినతి

మేడ్చల్ కలెక్టరేట్, ఏప్రిల్ 2 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం వరి ధాన్యానికి మద్దతు ధరపై అదనంగా రూ.500 బోనస్ ఈ సీజన్ నుంచే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో బీఆర్ఎస్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీఎంఎస్ రంగారెడ్డి జిల్లా వైస్ చైర్మన్ రామిడి మధుకర్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జహంగీర్, పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి, నాయకులు సంజీవరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ భూపాల్ రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు సబితాఇంద్రారెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్ గౌడ్, అరెకపూడి గాంధీ, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తదితరులు



శామీర్‌పేటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పక్కన ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి

# కాంగ్రెస్ పార్టీ డమ్మీ

## బీఆర్ఎస్ - బీజేపీ మధ్యే పోటీ

**చేవెళ్లలో చెల్లని రూపాయి.. మల్కాజిగిరిలో చెల్లుతుందా..?**

**అభివృద్ధికి సహకరించని బీజేపీకి ఎందుకు ఓటువేయాలి?**

**కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులకు మల్కాజిగిరితో సంబంధం ఉందా..?**

**గత పదేండ్లలో చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ఇంటింటికీ వివరిద్దాం**

**కాంగ్రెస్ పార్టీ 420 హామీలను నెరవేర్చే వరకు నిద్రపోనివ్వం**

**బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించండి**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

మేడ్చల్, ఏప్రిల్ 1 (నమస్తే తెలంగాణ) : రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి బీజేపీతోనే పోటీ ఉంటుందని, మల్కాజిగిరి పార్లమెంట్ బరిలో కాంగ్రెస్ పార్టీ డమ్మీ అభ్యర్థిని నిలబెట్టిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట్‌లో మల్కాజిగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా కేటీఆర్ హాజరై ప్రసంగించారు. మల్కాజిగిరి ప్రాంతానికి ఏ మాత్రం సంబంధంలేని అభ్యర్థిని చేవెళ్లలో రిజక్ట్ చేస్తే ఇక్కడికి తీసుకువచ్చి మల్కాజిగిరి ప్రజలపై బలవంతంగా రుద్దే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ నిలబెట్టిన డమ్మీ అభ్యర్థికి ఓటు వేస్తే అది బీజేపీకే లబ్ధి జరుగుతుందన్నారు. డమ్మీ అభ్యర్థికి మల్కాజిగిరి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని కోరారు.

### అభివృద్ధికి సహకరించని బీజేపీకి ఓటెందుకు వేయాలి.?

బీజేపీ అభ్యర్థి ఈటల రాజేందర్ తనకు ఓటు వేయాల్సిందిగా అభ్యర్థించడానికి వస్తున్నారని, 10 ఏండ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం మల్కాజిగిరి ప్రజలకు ఏం చేసిందని ప్రశ్నించారు. రాష్ట్రాభివృద్ధికి సహకరించని బీజేపీకి ఓట్లు అడిగే అర్హత లేదన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు మెడికల్ కాలేజీలు వచ్చాయని, తెలంగాణకు మాత్రం ఒక్క మెడికల్ కాలేజీ ఇవ్వలేదని, అభివృద్ధి కోసం రక్షణ భూములు అడిగితే ఇవ్వలేదని, నవోదయ, సైనిక్ స్కూళ్లను మంజూరు చేయలేదని అన్నారు.

### అభివృద్ధి చేశాం.. సంక్షేమ పథకాలు ఇచ్చాం.. ప్రజలకు వివరించలేకపోయాం

బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించక పోవడంతోనే బీఆర్ఎస్‌కు నష్టం జరిగిందని, ఈ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రజలకు తెలిసే విధంగా అన్ని విషయాలను తెలియ పర్చాలని కేటీఆర్ బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. 420 హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు నేరవేర్చాల్సిందేనని, వెంటపడుతామని, నిద్రపోనియ్యమని హెచ్చరించారు. రాగిడి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

### నాలుగు నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలకు విసుగు

**- మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి**

బీఆర్ఎస్ నాయకులను భయాందోళనకు గురిచేస్తూ కాంగ్రెస్ పార్టీలో చేర్చుకుంటున్నారని మాజీ మంత్రి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. భయంతో కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేస్తామని తనకు చెబుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడ్చల్ నియోజకవర్గంలో నిరుపేదలకు చెందిన వేలాది ఇండ్లను కూల్చి వేసిందని తెలిపారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు క్యాడర్ లేదు, లీడర్లు లేరని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రెండు జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలకు మల్కాజిగిరి ప్రజలు తగిన బుద్ధి చేబుతారని చెప్పారు. నాలుగు నెలల కాంగ్రెస్ పాలనతో ప్రజలు విసుగు చెందారని అన్నారు.

### ఒక్క అవకాశం ఇవ్వండి

**- అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి**

వారంటీ లేని గ్యారంటీలు ఇచ్చి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి ఆరోపించారు. వంద రోజులైనా ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయని పరిస్థితి నెలకొందన్నారు. గడిచిన పదేండ్లలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ హైదరాబాద్ నగరాన్ని అన్ని రంగాల్లో తీర్చిదిద్దారని చెప్పారు. ఐటీ రంగంతో పాటు అన్ని రంగాల్లో తెలంగాణ రాష్ట్రం దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. మల్కాజిగిరికి పార్లమెంట్ ఎంపీగా ఉన్న సమయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏమీ చేశారని ప్రశ్నించారు. కనీసం నియోజకవర్గంలో పర్యటించిన దాఖలాలు లేవని అన్నారు. రానున్న ఎన్నికల్లో ఒక్క అవకాశం కల్పిస్తే.. మల్కాజిగిరిని అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు, మేయర్ జక్క వెంకట్ రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, టీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



### పార్టీ శ్రేణులతో కలిసి భోజనం చేసిన కేటీఆర్

సమావేశం అనంతరం బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భోజనం చేశారు. స్థానికంగా నెలకొన్న పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. భాస్కర్ ఇస్తాడు